క్లుప్తంగా

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఈ వారం సంజామల, ఆకుమల్ల, పేరుసోముల,నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు సంబంధించి విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల,అక్కంపల్లె,గిద్దలూరు,ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

గుంత ఉంది జాగ్రత్త..!


ఆల్వకొండ క్రాస్‌లో రోడ్డుపై ఉన్న గుంత

సంజామల: కోవెలకుంట్ల-అవుకు ప్రధాన రహదారిలోని ఆల్వకొండ క్రాస్ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో రోడ్డుపై గుంత పడింది. వాహనదారులు దగ్గరకు వస్తే కాని గుంత కనిపించని పరిస్థితి. దీంతో ఆకస్మాత్తుగా బ్రేకులు వస్తుండడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత పూడ్చివేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ


అబ్దుల్ వహబ్

కోవెలకుంట్ల: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కోవెలకుంట్లకు చెందిన షేక్ అబ్దుల్ వహబ్ ప్రతిభ కనబరిచాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఈ విద్యార్థికి ఆల్ ఇండియా జనరల్ కేటగిరిలో 5,946 ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 671 ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థిని తల్లిదండ్రులతోపాటు పలువురు అభినందించారు.

రోగులకు పండ్లు పంపిణీ


రోగులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ వంద పడకల ఏరియా వైద్యశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. రోగులకు పండ్లు, బ్రెడ్డును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసేందు కు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సుజాత, ఇతర వైద్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన నేట్ల జయరామిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ రూ. 25,116 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కీ.శే.లు నేట్ల పెద్దసంజీవరెడ్డి, బాలసుబ్బమ్మ,పవన్ కుమార్‌రెడ్డిల జ్ఞాపకార్థం అందజేసినట్లు చెప్పారు. ఈ మేరకు దాతలను ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సంఘం నాయకులు

డోన్ రూరల్: మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటు కోసం ఆ సంఘం నాయకులు ఆదివారం గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వాల్మీకి న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ శీలం భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ.. గ్రామంలో వాల్మీకివిగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసుదన్‌రెడ్డి, నారాయణగౌడ్, నాగేంద్ర, వలసల రామకృష్ణ, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సర్వేలు ఫుల్.. సేవలు నిల్

- సర్వేల పేరుతో ఉద్యోగులకు పని ఒత్తిడి
- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- సేవలు అందక ప్రజల ఇక్కట్లు


ఆర్.లింగందిన్నెలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)


సంజామల సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సంజామల: స్థానికంగానే ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో మండల కేంద్రంలో లభించే సేవలు గ్రామ సచివాలయంలోనే పొందే అవకాశం లభించింది. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. రేషనలైజేషన్ పేరుతో సచివాలయ సిబ్బందిని ఆందోళలో నెట్టింది. కూటమి ప్రభుత్వ ఏర్పాటై దాదాపు పది నెలలు కావస్తున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. సంక్షేమ పథకాలు అటకెక్కించడమే కాకుండా సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికి పంపించడంతో సచివాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నా యి. దీంతో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదు. మళ్లీ మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్ని సర్వేలో..

మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను 11 సచివాలయాలు, 11 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో 11 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందికి గడ్డుకాలం ఎదురైంది. ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండానే సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ పంపే కార్యక్రమం చేపట్టింది. ఇప్పటి వరకు దాదాపు 20 సర్వేలు పూర్తి చేయించింది. సర్వేల పేరుతో ప్రభుత్వ సెలవు రోజు కూడా సర్వేలు చేసే పరిస్థితి ఏర్పడిందంటే పని ఒత్తిడి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. పని ఒత్తిడి తట్టుకోలేక గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు

వివిధ సర్వేలతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయింగ్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగ్, పీ4, డెత్ వెరిఫికేషన్, పీఏసీఎస్, ఆరు సంవత్సరాల్లోపు పిల్లల మిస్సింగ్ ఆధార్, నాన్ ఏపీ రెసిడెన్షియల్, ఈకేవైసీ, వర్క్ ఫ్రం హోం, మన మిత్ర తదితర సర్వేలతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతి సర్వేకు సెల్‌ఫోన్‌తో ముడిపడింది. సర్వే పూర్తి కావాలంటే మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. ఓటీపీ రాకుంటే సర్వే చేసిన మొత్తం వృథా అవుతుంది. మళ్లీ మొదటి నుంచి సర్వే చేయాలని సిబ్బంది వాపోతున్నారు.

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు



ప్రజలు గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులు చేయించుకునే వారు. ఇప్పుడు సచివాలయంలో సేవలకు బ్రేక్ పడడంతో కథ మళ్లీ మొదటకు వచ్చింది. ఏ చిన్న సర్టిఫికేట్ కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. సేవలు ఆగిపోవడమే కాకుండా సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇంటింటికి పంపుతున్నారు.

–దారెడ్డి సుధాకర్‌రెడ్డి,సంజామల మండలం

గతంలో అన్ని సేవలు సులభం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికంగానే ప్రజలకు సులభంగా సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు అవుతున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. సర్వే చేయించడమే తప్ప ప్ర జలకు ఉపయోగపడే పనులు చేయడం లేదు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. గతంలోలా అన్ని సేవలు కొనసాగిస్తే బాగుంటుంది.

–మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, సంజామల

అగ్నిమాపకశాఖ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న సబ్ జైలర్ యోగేష్‌కుమార్

బనగానపల్లె రూరల్: అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని బనగానపల్లె సబ్ జైలర్ యోగేష్‌కుమార్ అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగిన సమయంలో ఎంతో ధైర్యంతో ప్రమాదాల నివారణకు కృషి చేయడం అభినందనీయమని, ముఖ్యంగా అమరావతిలో జరిగిన ఫ్లడ్స్ సమయంలో వీరి సేవలు మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రిసెప్షన్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని


వధూవరులను ఆశీర్వదిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె: స్థానిక జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బనగానపల్లె పట్టణానికి చెందిన కర్నాట సురేంద్రబాబు, సరోజమ్మ మనువరాలు సౌజన్య, వెంకట నరసింహ అఖిల్ రిసెప్షన్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, గుండ్ల శింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుండం శేషిరెడ్డి ఉన్నారు.

వివాహ వేడుకలో మాజీ మంత్రి బుగ్గన


వరుడికి అభినందనలు తెలియజేస్తున్న బుగ్గన

డోన్ టౌన్: కర్నూలు నగరంలోని బైరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో డోన్ పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నేత అక్బర్ బాషా మనువని వివాహ రిసెప్షన్(వలిమా)కు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

మహానందిలో దర్శనానికి 2 గంటలు

మహానంది: సెలవురోజు కావడం, పెళ్లిళ్లు అధిక సంఖ్యలో ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు మహానంది ఆలయానికి తరలిరావడంతో దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ అంబ టి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి, ఎం.నీలకంఠరాజులు ఏర్పాట్లు చేశారు.

మరమ్మతులకు ఎదురుచూపు


ముద్దవరంలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. గ్రామం మీదుగా ఏడాది క్రితం డబుల్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలోని పాఠశాల ముందు భాగంలో మాత్రం గతుకుల మయంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా బేతంచెర్ల మండల కేంద్రానికి, వెల్దుర్తి మండలానికి వెళ్లే పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థికి సత్కారం


విద్యార్థిని సత్కరిస్తున్న సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్: డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ ఒకేషనల్(అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్) గ్రూప్‌లో 1000 మార్కులకు గాను 903 మార్కులు సాధించిన ఆసిఫ్‌ను సత్కరించారు. ఆదివారం స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ భవనంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, ఫార్మసిస్ట్ అసోసియేషన్ నాయకులు సత్కరించి దాతలు అందించిన రూ.4వేల నగదును అందజేశారు. అధ్యాపకులు ధనుంజయశెట్టి, చంద్రమోహన్, దాతలు జగన్‌మోహన్, కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, పీవీ రంగయ్య, కుల్లాయప్ప, హెచ్‌ఎం సురేష్‌బాబు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో కార్డన్‌సెర్చ్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, రేవనూరు ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు ఆదివారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్‌లు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు కాలనీలో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. కాలనీలో మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని పేర్కొన్నారు.


బనగానపల్లె: సీఎస్‌ఐ టౌన్ చర్చిలో ప్రార్థనలు


డోన్: ప్రార్థనలు చేస్తూ..


కోవెలకుంట్ల: రంగులు చల్లుకుంటున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- రంగులు చల్లుకుంటూ సందడి చేసిన యువకులు


కొలిమిగుండ్ల: కేరింతలు కొడుతున్న యువత

బనగానపల్లె రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బనగానపల్లె పట్టణంలోని పంచమపేట, భానుముక్కల ఎస్సీ కాలనీ, సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఎస్సీ కాలనీలతో పాటు మండలంలోని కైప, అప్పలాపురం, టంగుటూరు, నందివర్గం, రామతీర్థం, బీరవోలు, పలుకూరు, రామక్రిష్ణాపురం, యనకండ్ల, ఇల్లూరుకొత్తపేట, తమ్మడపల్లె తదితర గ్రామాల్లో క్రైస్తవులు రంగులు చెల్లుకుంటూ సందడి చేశారు. పట్టణంలోని సీఎస్‌ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ దైవదీనం, మదర్‌థెరిస్సా చర్చిలో ఫాదర్ బాబురాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కొలిమిగుండ్ల: బెలుం సీఎస్‌ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే రోజు సిలువ త్యాగ మరణం పొందిన ఏసుక్రీస్తు మూడో రోజు ఆదివారం సజీవుడై లేచిన రోజే ఈస్టర్ పర్వదినంగా క్రైస్తవులు జరుపుకుంటారు. చర్చి నుంచి రంగులు చెల్లుకుంటూ బాణాసంచా పేలుస్తూ, గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. బస్టాప్ వద్ద ఉన్న కొండపైకి చేరుకుని భారీ శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల చర్చిల్లో క్రైస్తవులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం రంగులు చల్లుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. కోవెలకుంట్ల-నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రోమన్‌కాథలిక్ మిషన్ చర్చి,చర్చి ఆఫ్ సౌత్ ఇండియన్ చర్చి, హోసన్నా, నూతన యేరుసలేం, మిస్పా, హరేబు, మండల ంలోని గుళ్లదూర్తి, కంపమల్ల, భీమునిపాడు, జోళదరా శి, కలుగొట్ల, వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, అమడాల, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు.ఆయా చర్చిల పాస్టర్లు లూర్దు, ఇసాక్‌రాజ, ప్రేమ్‌సాగర్ బాబు, అబ్రహాం ఏసు సందేశాన్ని వినిపించారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం, ముసలాయిచెరువు, బుక్కాపురం, బుగ్గానిపల్లె తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం,సీఎస్‌ఐ, హోసన్నా ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. సిమెంట్‌నగర్‌లోని సీఎస్‌ఐ చర్చి, ఏబీఎం చర్చిలో భక్తులు ప్రదక్షిణలు నిర్వహించారు. పాస్టర్లు ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించారు.

డోన్ టౌన్: పట్టణంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ గొప్పతనాన్ని వివరించారు. ఇతరులపై దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని సూచించారు.




కలుగొట్ల సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు, బేతంచెర్ల: సిమెంట్‌నగర్ ఏబీఎం చర్చిలో సందేశం వినిపిస్తున్న పాస్టర్, ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

23న ఆరాధన మహోత్సవాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వెలసిన పాలికి వర చిదంబర స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, మహా మంగళ హారతులు, తత్సంగాలు, అఖండ భజనలు, తదితర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మంచినీరు వృథా


వృథాగా పోతున్న నీరు

వేసవి కావడంతో భూగర్భ జలాలు అడుగంటి మంచినీటి సమస్య జఠిలంగా మారుతోంది. ఇలాంటి తరుణంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. అయితే కొలిమిగుండ్ల బ్రిడ్జి సమీపంలో మినీ వాటర్ ట్యాంక్‌కు కొళాయిలు అమర్చకపోవడంతో రోజుల తరబడి నీరు వృథాగా పోతున్నాయి. స్థానికులు చూస్తు ఊరుకోలేక ప్లాస్టిక్ కొళాయిలు అమర్చుతున్నా అవి నిలబడడం లేదు. పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుని నీరు వృథాగా పోకుండా కొళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. –కొలిమిగుండ్ల

ఆర్టీసీ ప్రాంగణం.. ప్రచారానికి కేంద్రం..!


బస్టాండ్ లోపలి భాగంలో అతికించిన పోస్టర్లు


బస్టాండ్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన కటౌట్లు

కొలిమిగుండ్ల: ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించిన కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్ పబ్లిసిటీకి అడ్డాగా మారిపోయింది. బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రచారానికి వేదికగా మార్చేశారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వ్యాపారాలకు చెందిన ప్రకటనలు ఇలా పలు రకాలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిండియింది. రామ్‌కో సిమెంట్ కంపెనీ ఏడాది క్రితం ప్లాట్‌ఫారంపై సీసీరోడ్డు ఏర్పాటు చేయించింది. ప్రహరీ గోడ నిర్మించి టాయ్‌లెట్లు ఆధునీకరించారు. బస్టాండ్ మొత్తం కొత్తగా రంగులు వేసి కళకళలాడేలా చేశారు. ముందు భాగంలో భారీ లైటింగ్ బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం బస్టాండ్ లోపల గోడలు పోస్టర్లతో నిండిపోయి అపరిశుభ్రంగా మారిపోయాయి. ప్రజా సంఘాలు, రాజకీయ పరమైన ఫ్లెక్సీలు, కటౌట్లు ముందు భాగంలో పూర్తి కిందకు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు తగిలి ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి వాటిని అలాగే ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఆటోలు, బైక్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ఆర్టీసీ బస్సులు లోపలికి వచ్చే క్రమంలో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కంటే ఎక్కువ భాగం స్థానికులే గంటల తరబడి తిష్టవేసి పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. దీంతో మహిళలు సమీపంలోని దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్టాండ్ మొత్తం ప్రచారాలకు వాడుకుంటున్నా ఆర్టీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.